بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ     نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْکَرِیْمِ     وَعَلٰی عَبْدِهِ الْمَسِیْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 15.05.2015 (Telugu)

**ఇవి అల్లాహ్ కార్యములు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విద్యా, విజ్ఞాన నిధులతో అతడు పంపెను. సఫలమగునని వాగ్దానము చేసెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సాహిత్యము, పుస్తకముల నుండి అధికాధికముగా ప్రయోజనము పొందుటకు ప్రయత్నించుట మన కర్తవ్యము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకములను చదివే విషయములో మన దృష్టి గతంలో తక్కువ యున్నచో ఇప్పుడు ఆ శ్రద్ధ మరింత అధికము కావలెను.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 15.05.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

పంజాబ్ (పాకిస్తాన్) ప్రభుత్వము జమాఅత్ పలు పత్రికలు, పుస్తకముల ప్రచురణ లేదా ప్రదర్శన మొ॥ పై ఆంక్షలు విధించిన విషయమును గత జుమాలో నేను ప్రస్తావించితిని. అక్కడి పలు పత్రికలు ఈ విషయమును ప్రచురించినవి. ఈ రోజులలో ఫోన్ ద్వారానే చిత్రములతో కూడిన సందేశములు సందేశములు పంపే వివిధ పద్ధతులతో కొన్ని నిమిషములలోనే ప్రపంచమంతటా వ్యాపించుచున్నవి. వీటిని విని, చూచి నాకు కూడ ప్రజలు ఉత్తరములు వ్రాయుదురు. ఫ్యాక్స్ ద్వారా తమ ఆందోళను తెలుపుదురు. ఈ విషయములు క్రొత్త కాదని మనము గుర్తుంచుకోవలెను. అహ్మదియ్య జమాఅత్ ప్రారంభమైనప్పటి నుండి వీరు ఇటువంటి కర్యాములకు పాల్పడుచున్నారు. పాల్పడుదురు కూడ. ఈ కార్యముల వలన ఇంతకు ముందెన్నడు జమాఅత్‌నకు నష్టము కలుగలేదు, ఇక ముందు కూడ నష్టము కలుగదు, కలిగించలేరు, ఇన్షాఅల్లాహ్. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం దైవ కార్యమునకు ఈ కార్యములతో నష్టము కలిగించే బాలునికి నేటికి ఏ తల్లి జన్మనివ్వలేదు. ఈ నామమాత్రపు ఉలమాలకు అహ్మదియ్యత్ ప్రగతిని చూచి ఈర్ష్యను వ్యక్తపరచుటకు ఒక సాకు కావలెను. ఈ ఈర్ష్యలో వారెంత వరకు అంధులైనారనగా వారి తెలివి తేటలపై తెరలు పడినవి. బాహ్య రూపములో విద్యావంతులైనను మూర్ఖుల కంటే హీనంగా తమ స్థితులను వ్యక్తపరచుచున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇస్లాం నిజమైన బోధనను, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్పతనమును ఎలా వివరించినారో తెలుసుకొనుటకు వారు ప్రయత్నించనే లేదు. అహ్మదియ్య జమాఅత్ లిట్రేచర్‌లో ఇవన్ని ఎంతో అందముగా వివరించబడును. అరబ్బులలో, అరబ్బేతరులలో నుండి నిజాయితీపరులు అహ్మదియ్య జమాఅత్ లిట్రేచర్‌ను చూచి, పుస్తకములను చదివి వాస్తవమును గ్రహించి, ఈ నామమాత్రపు విద్యావంతులు

తమను తాము ఇస్లాం నాయకులుగా భావించి హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బోధనలను, రచనలను ఏ విధముగా అసత్యము, మోసముతో తలక్రిందులు చేసి ప్రవేశపెట్టుచున్నారో తెలుసుకొని ఆశ్చర్యమును వ్యక్తపరతురు. ఆంహ(జత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్థాయిని, ఇస్లాం అందమైన స్థాయిని ఏ విధముగా హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వివరించినారో మన ఎమ్.టి.ఏ. జమాఅత్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమములో కూడ, లేఖల ద్వారా ఇంకా అహ్మదీయులు కాని అనేక వ్యక్తులు మాకీ విషయము ఇప్పుడే తెలిసినదను విషయమును వ్యక్తపరతురు. వాస్తవానికి ఈ ఉలమాలు మమ్ములను మూర్ఖత్వ తెరలలో యుంచిరి. అహ్మదియ్యత్‌తో శత్రుత్వము వలన వీరు తెలిసి, తెలియక ఆంహ(జత్ సల్లల్లాహు అలైహి వసల్లంను అవమానమునకు గురిచేయుటకు కారణమగుచున్నారు.

శత్రుత్వము, పీడనమే ఈ ఉలమాల ధర్మము. కనుక అమాయక, సాధారణ ముస్లిములలో ఎంత దుష్టత్వము ఏర్పడినను వాస్తవమును తెలుసుకొనుటకు వీరు ప్రయత్నించరు. వీరి పని ఇదే అయినందున వీరు చేయుచుందురు. చేయుచు పోవుదురు. ఎందుకనగా వీరికి ధర్మము కంటే స్వప్రయోజనములే ముఖ్యము. మన విశ్వాసమును మరింత ప్రకాశవంతము చేయుటకు, హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తో బంధమును పెంచుకొనుటకు ఈ వ్యతిరేకుల చర్యలు ఎరవుగా పని చేయవలెను. హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకములను చదివే విషయములో మన దృష్టి గతంలో తక్కువ యున్నచో ఇప్పుడు ఆ శ్రద్ధ మరింత అధికము కావలెను.

ఒక్క పంజాబ్ (పాకిస్తాన్) ప్రభుత్వ ఆటంకమే కాదు మొత్తం ప్రపంచ ప్రభుత్వ ఆటంకములు కూడ ఈ కార్యమును నిరోధించలేవు. ఎందుకనగా ఇవి మానవ కృషితో చేయబడుచున్న పనులు కావు. ఇవి దైవ కార్యములు. అతడు హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను విద్య, విజ్ఞానముల నిధులతో పంపెను. సఫలము గురించి వాగ్దానము చేసెను. పెద్ద పెద్ద ఆటంకములు, వ్యతిరేకతల తర్వాత జమాఅత్ అభివృద్ధి అధికముగా స్పష్టముగా కనిపించినది. మన వ్యతిరేకి తమ ఆలోచనలో తీసుకున్న ఈ చర్య ఒక సాధారణ ఆటంకము మాత్రమే. మనలను ఎంత అణగదొక్కుదురో అంతే అల్లాహ్ తన అనుగ్రహములను పెంచును. ఇన్షాఅల్లాహ్ ఇప్పుడు కూడ మంచియే జరుగను. కనుక ఆందోళన చెందవలసిన అవసరము లేదు. ఇప్పుడు ప్రపంచములోని ఇతర దేశములలో కూడ హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పుస్తకములు ప్రచురించబడుచున్నందున కలత లేదా ఆందోళన చెందవలసిన అవసరం లేదు. వెబ్‌సైట్‌లో కూడ లభ్యమగుచున్నవి. ఆడియోలో కూడ కొన్ని పుస్తకములు అందుబాటులో యున్నవి. మిగతావి కూడ త్వరలోనే అందుబాటులో తేవడానికి ప్రయత్నము చేయబడును. ఒకప్పుడు ప్రచురణపై ఆంక్షలు విధించినచో నష్టము కలుగుననే భయముండేది. ఇప్పుడు అల్లాహ్ అనుగ్రహముతో ఈ విద్యా, విజ్ఞాన నిధులు ఆకాశములో వ్యాపించియున్నవి. ఒక్క బటన్ నొక్కడంతో మన ముందుకు వచ్చును. హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సాహిత్యము, పుస్తకముల నుండి అధికాధికముగా ప్రయోజనము పొందుటకు ప్రయత్నించుట మన కర్తవ్యము. ఎమ్.టి.ఏ.పై హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకముల పాఠము (దర్స్) గతము కంటే అధిక సమయములో ప్రసారము చేయవలెనని నేనిప్పుడు భావించినాను. ఈ విధముగా పాకిస్తాన్‌లోని ఒక్క రాష్ట్ర చట్టము వలన ప్రపంచ వ్యాప్త అహ్మదీయులకు లబ్ధి కలుగును. మేము రసూల్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమలో చాలా ముందున్నామని, ఇస్లాం బోధనల పెద్ద నాయకులమని ఎల్లప్పుడు వీరు విర్రవీగుచుందురు. ఇదే

కారణముతో వీరు మనలను వ్యతిరేకింతురు. సదుద్దేశముతో వీరెన్నడు జమాఅత్ లిట్రేచర్‌ను చదవలేదు, చదువుటకు ప్రయత్నించలేదు. అనేక సార్లు వీరికి వీరి ప్రకటన వాస్తవమును, వీరి నిజమైన ముఖమును మన ద్వారా చూపబడును. మన వ్యతిరేకుల దృష్టిలో నవూజుబిల్లాహ్ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్థాయికి విరుద్ధముగా, గొప్పతనమునకు వ్యతిరేకముగా, ద్వేషము కలిగించే, బాధ కలిగించే విషయములు రచించబడినవని వీరు భావించే కొన్ని పంక్తులను నేడు నేను ప్రవేశపెట్టదను.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్పతనము, స్థాయిని మనకు వివరించిన అన్ని అంశములు చాలా విశాలమైనవి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రేమించు ప్రకటన చేయు వ్యక్తి వీటిని వినుటకు, చదువుటకు తమ చెవులను, కనులను ఎలా మూసుకొనునని ఆశ్చర్యము కలుగును. ఈ నామమాత్రపు ఉలమాలతో మనకు ఎలాంటి సంబంధము లేదు. ఎమ్.టి.ఏ. ద్వారా వినే వారి హృదయములను మరింత తెరుచుటకు, అహ్మదీయుల హృదయములకు, మనసులకు మరింత ప్రకాశము కలిగించుటకు, సరియైన అవగాహన కలిగించుటకు నేను కొన్ని పంక్తులను ప్రవేశపెట్టెదను.

ఒకటికి: దైవ ప్రశంస, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంపై దురూద్ పంపు ప్రియమైన విధానమును ఒక చోట హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లు వివరించిరి. ఓ అల్లాహ్! నీకు వేలాది వేలాది కృతజ్ఞతలు. నిన్ను గుర్తు పట్టుటకు మార్గమును నీవే తెలిపితివి. తమ పవిత్ర పుస్తకములను పంపి ఆలోచన, తెలివికి సంబంధించిన తప్పిదముల, లోపముల నుండి రక్షించితివి. హజ్రత్ సయ్యదుర్రుసుల్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం. వారి కుటుంబము, వారి అనుచరులపై దురూద్, శాంతి కలుగుగాక! వారి ద్వారా అల్లాహ్ ఒక ప్రపంచమును సన్మార్గముపై నడిపెను. వారు శిక్షకులు, ప్రయోజనకర్తలు ఎందుకనగా మార్గభ్రష్టులైన మానవజాతిని సన్మార్గముపై తెచ్చినారు. ప్రజలను అన్యారాధన, విగ్రహముల ఆపద నుండి రక్షించినందుకు వారు ఉపకారి అయినారు. దైవ ఏకత్వ కాంతిని ప్రపంచములో వ్యాపింపజేసినందుకు వారు కాంతి, కాంతిని ప్రబలించువారు. చెడిపోయిన హృదయములను సత్పథముపై నడిపించినందుకు వారు ఈ కాలపు వైద్యులైరి. మృతులకు జీవితపు నీరు త్రాగించినందుకు వారు మహిమాన్వితులైరి. సమాజ దుఃఖమును భరించినందుకు వారు కరుణామయులు అయిరి. మృత్యువు ముంగిట నుండి మనలను తీసుకొచ్చినందుకు వారు వీరులు, ధీరులైరి. దాసత్వములో తలను వంచి, తన ఉనికిని మట్టిలో కలిపిన దయాళువు, నిస్వార్థపరులు. అల్లాహ్ వైభవమును చూసి, ఇతరులను తమ దృష్టిలో శూన్యముగా భావించినందున వారు సంపూర్ణ దైవ ఏకత్వ ఆరాధకులు, విజ్ఞాన సముద్రమైరి. నిరక్షరాస్యులై కూడ అందరిపై నిజమైన విద్యలలో విజయము పొంది, ఇతర జాతులన్నిటిని తప్పిదములతో కూడినవిగా నిరూపించినందున వారు దయామయుడైన అల్లాహ్ మహిమ అయిరి.

కఠిన రోజులలో, విజయముల కాలములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సత్ప్రవర్తనలు ఎలా యుండెనోననే విషయమును వివరించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ప్రజలు సర్వ సద్గుణములలో అనుసరించుటకు ప్రవక్తల, మిత్రుల ఉనికి యుండును. ఏ ఏ విషయములలో అల్లాహ్ వారికి స్థిరత్వము కల్పించెనో ఆయా విషయములలో సత్యాన్వేషులందరు అనుసరించవలెను. సరియైన సమయములో ప్రత్యక్షము కానంత వరకు ఒక వ్యక్తి సత్ప్రవర్తనలు పూర్తిగా బహిర్గతము కాలేవను విషయము చాలా స్పష్టమైనది. (ప్రతి ప్రవర్తనకు ఒక సమయముండును. ఆయా సమయములలో బహిర్గతమైనప్పుడే అవి నిరూపితమగును)

అప్పుడే అవి హృదయములను ప్రభావితము చేయగలవు. ఉదాహరణకు ప్రతీకారము తీర్చుకొనగల శక్తి యున్నప్పుడే క్షమాపణ, నమ్మకము ప్రశంసించదగినవగును. (ప్రతీకారము తీసుకొను శక్తి యున్నప్పుడు క్షమించుట ఒక ప్రశంసించదగ్గ విషయము). మానసికంగా ఆనందించే శక్తి యున్నప్పుడు సన్మార్గమును అవలంభించుట ఒక పొగడదగిన విషయమగును. ప్రవక్తల, మిత్రుల సత్‌ప్రవర్తనలు అన్ని రకాలుగా బహిర్గతమగుటకు, నిరూపితమగుటకు అల్లాహ్ ఆశించును. కనుక ఇదే సంకల్పమును అల్లాహ్ పూర్తి చేయుటకు వారి కాంతివంతమైన ఆయువును రెండు భాగములుగా విభజించును. (రెండు భాగములుండును). ఒక భాగము ఆపదలు, కష్టములలో గడుచును. వారి గొప్ప గొప్ప సత్‌ప్రవర్తనలు బహిర్గతమగుటకు అన్ని విధాలా బాధించబడుదురు, ఇబ్బందికి గురి చేయబడుదురు. అవి చాలా కఠిన ఆపదలు రానిదే బహిర్గతము కాలేవు.

ప్రవక్తల, మిత్రుల రెండవ భాగము జీవితములో విజయము, సంపద పూర్తిగా లభించును. తద్వారా విజయము, గొప్పతనము, అధికారము, ప్రభుత్వము కలగియుండుట అనివార్యమైన సత్‌ప్రవర్తనలు బహిర్గతమగును. ఎందుకనగా తనకు బాధ కలిగించినవారిని క్షమించుట, ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టుట, తమ శత్రువులను ప్రేమించుట, తమ దురుద్ధేశుల పట్ల మంచిని కోరుట, సంపదను అతిగా ఆశించకపోవడం, సంపదతో గర్వము ప్రదర్శించకపోవడం, ధనికులైన తర్వాత లోభితనమును అవలంభించకపోవడం, దాన, ధర్మములు అధికముగా చేయడం, గర్వమును ప్రదర్శించకపోవడం, ప్రభుత్వమును హింసించుటకు వినియోగించకపోవడం వంటివి మానవునికి సంపద, అధికారము లభించినప్పుడే నిరూపితమగును. అనగా ఆపద, కష్టముల కాలము, సంపద, అధికార కాలము (బలహీన, కష్ట కాలము, సంపద, అధికార కాలము) రానిదే ఈ రెండు రకాల సత్‌ప్రవర్తనలు బహిర్గతము కావు. సారాంశమేమనగా దాన, ధర్మములు, నిష్టాపరత, వున్నదానిలోనే తృప్తి పడుట, సాహసము, ధైర్యము, దైవానురాగము గురించి గల ఉత్తమోత్తమ సత్‌ప్రవర్తనలను హజ్రత్ ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లంలో అల్లాహ్ ఏ విధముగా బహిర్గతపరచెననగా ప్రపంచములో గతములో లేదా ఇక ముందు కూడ బహిర్గతము కాలేవు.

ఈ అర్థములో అల్లాహ్ ఆ పవిత్ర ఉనికిపై దైవవాణి, ప్రవక్తుత్వమును అంతము చేసెను. وهذا فضل الله يؤتيه من يشاء- ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రేమించడం, అనుసరించడం వలన అల్లాహ్ ప్రియునిగా మానవుడు మారవచ్చుననే విషయమును వివరించుచు వారిట్లనిరి. అల్లాహ్ ఎవరినైనా ప్రేమించుటను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుసరణతో జోడించెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లమే అందరి కంటే సంపూర్ణ మానవులు, పరిపూర్ణ ప్రవక్త. తమ ఉనికితో, తమ లక్షణములతో, తమ కర్మలతో, తమ ఆధ్యాత్మికత, పవిత్ర శక్తుల బలమైన నదితో విద్యాపరంగా, ఆచరణ పరంగా, సత్యము పరంగా, స్థిరత్వము పరంగా సంపూర్ణ మానవులని నిరూపించిరి. అందరికంటే సంపూర్ణులైన మానవులే సంపూర్ణ ప్రవక్త. పరిపూర్ణ శుభములతో వచ్చెను. వారి ద్వారా ఆధ్యాత్మిక అవతరణ, రాక వలన మొదటి ప్రళయ దినము ప్రత్యక్షమైనది. మృతి చెందిన ప్రపంచము మొత్తము వారి ఆగమనముతో జీవము పోసుకొనెను. హజ్రత్ ఖాతముల్ అన్బియా, ఇమాముల్ అస్ఫియా, ఖత్ముల్ ముర్సలీన్, ఫఖ్రున్నబియ్యీన్ జనాబ్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లమే ఆ పవిత్ర ప్రవక్త.

మరల ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పలు ఉపకారములను ప్రస్తావించుచు వారిట్లనిరి. దయామయులైన, సర్వ శుభములు కలిగిన, సంపూర్ణ విశిష్టతలు కలిగిన ప్రవక్తను అల్లాహ్ మన కొరకు

పంపెను. అన్ని మైదానములో అన్ని విధాలా మనలను ముందుకు తీసుకెళ్లను. వారు మొత్తం ప్రవక్తల, సందేశహరులతో ఉత్తములు. నగరముల కేంద్రములో అవతరించిన వాగ్దత్త ప్రవక్త వాస్తవానికి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమే. ఎందుకనగా వారితో లబ్ది పొందు వారి నాలుకలు అతన్ని అనుక్షణం స్తుతించును. వారు సమాజము కొరకు అతి కఠినమైన కష్టమును భరించిరి. ధర్మ భవనమును పైకి లేపిరి. మన కొరకు ఒక ప్రకాశవంతమైన, కాంతి గల పుస్తకము తెచ్చిరి. సకల లోకాల సంరక్షకుని సందేశములను మన వరకు అందించుటకు రక రకాల హింసలకు వారు గురైరి. గత పుస్తకములలో గల లోపములను, అసంపూర్ణ విషయములను వారు సల్లల్లాహు అలైహి వసల్లం సంపూర్ణము చేసిరి. అతి, అల్పము, ఇతర లోపములు, బలహీనముల నుండి పవిత్రమైన పవిత్ర శాసనము మనకందించిరి. సత్ప్రవర్తనములను సంపూర్ణము చేసిరి.

ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖత్మె నబువ్వత్ స్థానమును ప్రస్తావించుచు వారిట్లనిరి. మన ప్రియతమ నాయకులు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ సందేశహరులు, ప్రవక్త అని మేము విశ్వసించెదము. వారి సల్లల్లాహు అలైహి వసల్లం ధర్మము అందరి ధర్మముల కంటే ఉత్తమమైనది. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతముల్ అన్బియా (సర్వోన్నత ప్రవక్త) అని మేము విశ్వసించెదము. వారి ద్వారా లబ్ది పొంది శిక్షణ పొందినవారే, వారి భవిష్యవాణి ప్రకారము వచ్చిన వారు తప్ప మరెవ్వరు ప్రవక్తగా రాలేరు. ఖత్మె నబువ్వత్ అనగా ప్రవక్తుత్వ విశిష్టతలన్ని ప్రవక్తలలో, సందేశహరులలో సర్వోన్నతులైన మన ప్రవక్తలో అంతమైనవి. వారి సమాజమునకు చెందిన వ్యక్తి మాత్రమే వారి తర్వాత ప్రవక్తగా రావచ్చును. వారి అనుచరులలోని వ్యక్తి అయి యుండవలెను, లబ్దిని పూర్తిగా వారి ఆధ్యాత్మికతతోనే పొంది యుండవలెను. వారి కాంతితోనే కాంతి పొంది యుండవలెను.

ఇప్పుడు మాధ్యస్థము చేయువారు కేవలం ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం మాత్రమే. మానవజాతి కొరకు ఇప్పుడు భూమిపై పవిత్ర ఖుర్ఆన్ తప్ప మరో గ్రంధము లేదు. కేవలం ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తప్ప మరో ప్రవక్త, మాధ్యస్థము చేయువారు ఇప్పుడు మానవజాతి కొరకు లేరు. కనుక నిజమైన ప్రేమ ఆ వైభవోపేతుడైన సందేశహరునితో కలిగియుండుటకు మీరు ప్రయత్నము చేయగలరు. మీరు ఆకాశమున విముక్తి పొందినవారిగా వ్రాయబడుటకు ఇతరునికి వారిపై ఎలాంటి ఆధిక్యతనివ్వకుము. విముక్తి అనునది మృతి చెందిన తర్వాత లభించేది మాత్రమే కాదు. నిజమైన విముక్తి ఈ జీవితములోనే తన కాంతిని చూపును. విముక్తి పొందినవారెవరు ? దేవుడు సత్యమని, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని, మానవుల మధ్య మాధ్యస్థులని, ఆకాశము క్రింద వారంతటి వైభవము, గొప్పతనము గల మరో ప్రవక్త లేరని, పవిత్ర ఖుర్ఆన్ వంటి గొప్ప మరో గ్రంధము లేదని విశ్వసించు వారే విముక్తులు. శాశ్వతముగా జీవించియుండుటకు అల్లాహ్ మరొకరి కొరకు ఇష్టపడలేదు. కాని ఈ మహా ప్రవక్త సదా కొరకు జీవించియున్నారు.

ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్పతనము, స్థాయి గురించి హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ప్రస్తావించిన అనేక పంక్తులలోని ఈ కొన్ని పంక్తులను నేను వినిపించినాను. ఇదే విధముగా ఇస్లాం వివిధ బోధనల వివరణ గురించి కూడ వారు తెలిపిన విషయముల ఒక నిధి గలదు. దీనితో అధికాధికముగా ప్రయోజనము పొందు అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన ప్రేమికుని మాటలను విని, సాధారణ ముస్లిములకు సరియైన రీతిలో మార్గదర్శనము చేయు అనుగ్రహము, వివేకము ఇస్లాం నామమాత్రపు నాయకులకు కూడ అల్లాహ్ కలిగించుగాక!

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ ఇద్దరు మృతుల సత్‌ప్రస్తావన చేసిరి. ఒకరు గౌ॥ ముహమ్మద్ మూసా **దర్వేష్** ఖాదియాన్ గారు. వీరు 10 మే 2015 తేదీన 95 సం॥ల వయసులో ఖాదియాన్‌లో మృతి చెందిరి. మరొకరు అనగా శ్రీమతి సాహిబ్జాదహ్ అమ్తుర్రఫీఖ్ గారు 6 మే 2015 తేదీన 80 సం॥ల వయసులో రబ్వాలో మృతి చెందిరి. اناللهواناالیہراجعون. హుజూరె అన్వర్ వీరిరువురి కుటుంబ నేపథ్యము, సద్గుణములు, సేవలను ప్రస్తావించుచు వారి క్షమాపణ, గొప్ప స్థాయి నొసంగబడుటకు దుఆ చేయగలరని పిలుపునిచ్చిరి.

✡ ✡ ✡

**దర్వేష్:** అనగా ప్రపంచ కార్యములను వీడి దైవ స్మరణలో నిగ్నమైన వ్యక్తి. ఈ పదము అహ్మదియ్య జమాఅత్ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానము పొందినది. ఎందుకనగా క్రీ.శ.1947లో దేశ విభజన సందర్భమున ఖాదియాన్‌లో గల అహ్మదియ్య జమాఅత్ పుణ్యక్షేత్రాలను రక్షించుటకు సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహు అన్హు 313 నవయువకులను ఖాదియాన్‌లో వుంచిరి. వారు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రాత్రింబవళ్లు ఖాదియాన్‌ను దైవానుగ్రహముతో రక్షించుటకు ప్రయత్నించిరి. అటువంటి 313 మహా త్యాగమూర్తులను అహ్మదియ్య జమాఅత్ చరిత్రలో **"దర్వేష్"** అని అందురు.

*Summarised by: Majlis Ansarullah Bharat*
*Translated By Hafiz Syed Rasool Niyaz For Telugu Desk*
*From: Nazarath Nashr-O-Isha'ath, Qadian, Distt:Gurdaspur, Pin:143516, Punjab*

**సయ్యద్నా హుజూరె అన్వర్ ఆమోదముతో మజ్లిస్ అన్సారుల్లాహ్ భారత్ 25 జూలై 2015 నుండి 15 అక్టోబర్ 2015 వరకు డైమండ్ జూబ్లి (వజ్రోత్సవము) జరుపుకుంటున్నది.**